# "సద్వినియోగం" ★

రచన:
"ఫల్గుణ"

కాఫీకప్పు జారి క్రిందపడేంత పనైంది.

తమాయించుకున్నాడు గాని, బుర్రపని చేయడం మానేసింది కొంతసేపు.

ప్రక్కకు చూసేడు రామం, శ్యామం సరదాగా కబుర్లు చెప్పుకుంటూ బిల్లు చెల్లించి వెళ్లిపోతున్నారు. వాళ్ల ధ్యాసలో ఇతనిని చూడలేదు. అదీ మంచిదేఅయింది అనుకున్నాడు. లేకపోతే వాళ్ళన్నమాటలు తాను విన్నానేమో అని నానా అవస్థపడతారు.

నెమ్మదిగా బిల్లు చెల్లించి రోడ్డుమీద పడ్డాడు. అంతా అయోమయంగా వుంది. తను వినాలని ప్రత్యేకంగా వాళ్ళనవలసిన పనిలేదు. తాను లోపలికి రావడం వాళ్ళు చూడలేదు. చూడగలిగే ఆస్కారం గూడా లేదు. ఐతే ఇదంతా నిజమా ? నిప్పులేనిదే పొగ రాదంటారు!

సామెతలకేం? ఎన్నైనా చెపుతాం! గాని నిజమని నమ్మడానికాధారం ?

ఆధారం ?

కళ్ళు జిగ్‌మన్నాయి. నెం. 13 బస్సు ఆగింది ఎదురుగా. అందులోనుంచి దిగాడు శేఖరం.

ఆనాడు మరి ఆఫీసుపని చేయడం దుర్లభంగా కనిపించింది. ఏదో మొక్కుబడి తీర్చుకుని ఇల్లుచేరాడు ధనంజయరావు. సుభద్రాదేవి చిరునవ్వుతో స్వాగతం యిచ్చింది. ఆమె నడవడిలో పనిపాట్లలో కించిత్తయినా మార్పు లేదు. మరి శేఖరం ?

భోజనానంతరం డాబాపై పడుకున్నాడు. మసకవెన్నెల, చిరుమబ్బుల సందులనుండి కొంచెం కొంచెం పడుతుంది. ధనంజయుడు తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. తన మనస్సు పూర్తిగా కారుచీకటి, శేఖరం తనకు చిన్ననాటినుండీ తెలుసును. థర్డుఫారంనుంచీ స్కూలు ఫైనలు వరకూ ఒకే తరగతిలోనుంటూ వచ్చారు గాని, వారిద్దరూ స్నేహితులుమాత్రంకారు. థర్డుఫారం చివరిరోజులలో వారిద్దరిమధ్య చిన్న చిరుతగువు వచ్చినది. అది రానురాను కోతిపుండు బ్రహ్మరాక్షసిఅయి ఊరుకుంది. నాటివైరం నేటివరకూ తీరలేదు. విద్యానంతరం సాగిపోయిన దిన వార మాస వత్సర సముదాయములోనాతని ఛాయామాత్ర ప్రసక్తి రాలేదు.

అగస్మాత్తుగ నారు నెలలక్రిందట తను పనిచేస్తున్న ఈ విశాఖపట్టణం కలెక్టరాఫీసులో తన సెక్షనులోనే, బదిలీమీదవచ్చి తనకు సాటిగుమస్తాగా ప్రత్యక్షమాయెను. ఆది ఒక అపూర్వఘట్టము. ఆనాడు ఒకరినొకరు చూసుకుని దిగ్భ్రాంతులైరిగాని, మరుక్షణము వీక్షణ విముఖత్వము నేటివరకు సుముఖత్వప్రసక్తి రాలేదు

'కలయో వైష్ణవమాయయో' అన్నట్లు మిగిలినవారు భావించిరి.

తనకింత బద్ధవైరి తను ఇంట్లోలేని సమయాలలో తన యింటికి వస్తున్నాడు అంటే వింటున్నది కలా నిజమా అర్థంకాలేదు. మధ్యాహ్నం ఒక గంట టీ వేళప్పుడు సరాసరి బస్సులో వెళ్ళివస్తుంటాడూ అని ఇలా వారానికి అధమం ఒకటి రెండు రోజులైనా వెళ్ళివస్తుంటాడూ అని. ఇంతకన్నా దారుణం ఇంకేముంది? ఈ విషయం తనతోడివారికి రామం శ్యామలకు తెలియుట ఏమిటీ మాయ?

రామం శ్యామం ఈ దొండపర్తిలోనే యీ వీధిలోనే వున్నారు గనుక గాలికబుర్లక్రింద త్రోసిపారవేయవీలులేదు! పోనీ సుభద్రని అడిగేస్తే?........

ఏమని అడిగేట్టు? నిజమైతే బాధలేదు ఏదో ఒకటి తేలిపోతుంది గాని, ఇంకేమైనా ఆయితే అంతకన్నా....ఇంకేమీ వుండదు. చివరికి మిగిలేది....? దారుణం !

వారం పదిరోజులు సాగిపోయినాయి క్రొత్త విశేషాలేమీలేవు గాని ఈ జీవన్మరణసమస్య ఎటూ తేలక సతమతమౌతున్నాడు ధనంజయరావు. తన మనసులోని బాధ ఒకరితో చెప్పుకొనడానికి వీలులేదు. అలాగని ఏదో ఒకటి తేల్చిపారేద్దామన్నా! దారీ తెన్నూ కానక కటికచీకటి.

ఇంతలో శేఖరం కొత్తరాలీసైకిలుకొన్నాడు. దానితో ఇంకొక కొత్తఘట్టం రూపొందింద. రామం శ్యామలతో ఇంకొక పదిమంది తననొక వింతదృష్టితో చూడటం గమనించాడు. ధనంజయరావు పెద్ద మానసికతత్వశాస్త్రవేత్త కాకపోయినా ఎదురుగానున్న మానవుని నుదుటి ఫలకంపై స్పష్టంగా కనుపించే అతని అంతర్గత భావాలను చదవగలడు. ధనంజయునిలో ఆ శక్తే తనకు కొన్ని కొన్ని కొత్త చిక్కులను తెచ్చిపెడుతుంది. ఐనా తాను తొందరపడకపోవడానికి ఆ ధైర్యమే కారణం.

శేఖరం మధ్యాహ్నం ఒక గంట విశ్రాంతి కాలంలో ధనంజయరావు ఇంటికి ప్రతిదినం వెళ్ళిరావడానికే ఆ క్రొత్తసైకిలు కొన్నాడని; ఆ సైకిలు కొన్నదగ్గరనుంచి రోజు తప్పకుండా మధ్యాహ్నం ధనంజయునింటికి వెడుతున్నట్లు తమ గృహప్రసార కేంద్ర వార్తాసారాంశమన్న వారి యుద్దేశాలను గుర్తించాడు ధనంజయునికి ఆ ఆఫీసు ఒక నరకమైపోయింది. తతిమ్మావారితన్ని ఎడము చేసిరో లేక ఇతనిప్రపంచములో ఇతనే మ్రగ్గిపోతున్నాడో గాని తను మిగిలినవారినుంచి ప్రత్యేకింపబడ్డాడు.

ఇక ఆ యిల్లు ఇంటిలో సుభద్ర మహంకాళిలా కనుపిస్తున్నట్లు భావిస్తున్నాడు. ఐతే సుభద్రలోమాత్రం కించిత్తయినా మార్పు లేదు. నానా రకాలుగా ఆలోచించి ఆఖరికి ఒకవిధంగా తెగించేడు. అంతకన్నా ఇంకో మార్గం సుకరంకాదు.

ధనంజయుని అద్దెసైకిలుగూడ హాస్పిటలు దిగుడుదిగుతూ వెన్నాడుతూంది. ముందున్న శేఖరం వెనుక ధనంజయుని గుర్తించలేదు.

ధనంజయు డగస్మాత్తుగా మ్రాన్పడ్డాడు. కొంచెం లజ్జించాడు గూడ.

శేఖరంసైకిలు దొండపర్తివైపుకు మారుగ ఊరిలోనికి ఎడమప్రక్కకు మళ్ళింది.

రంగమధ్యంలోకి దూకిన తరువాత చావో రేవో తేల్చుకునితీరాలి. ఏమైతే అయిందని ఛాయామాత్రంగా పోతున్నాడు.

శేఖరం సైకిలుదిగి పూర్ణబజారులోనికి వెళ్ళాడు. ధనంజయుడు ముందుగనే దిగి అతను తనదృష్టిపథం దాటిపోకుండా జాగ్రత్తపడుతున్నాడు.

మల్లెపూలు తీసుకుని శేఖరం సైకులెక్కడంతో, ధనంజయరావుకు ఉన్నమతి కాస్త ఊడి ఊరుకుంది.

ఈ మధ్య రోజూ సాయంత్రం సుభద్ర తలలో మల్లెపూలు కనుపిస్తున్నాయి. అసలు మల్లెపూలంటే సుభద్రకు ప్రాణం. ఒకచిత్రం తన మనోదృక్పథంలో కనుపిస్తుంది. మిగిలిన ప్రపంచమంతా గాఢాంధకారమయం. మనోవీధిలో మల్లెపూలతో సుభద్ర; ప్రకృతవీధిలో ముందు వెడుతున్న శేఖరం అతని చేతిలో మల్లెపూలు.

రానురాను ద్విచక్రశకటద్వయం వంపులు తిరిగి మళుపులు మళ్ళి దొండపర్తి సమీపిస్తున్నాయి. సమీపిస్తున్నకొలదీ ధనంజయుని హృదయాంతర్గత భావవికృతసంచలన మధన ప్రతిఫలస్వరూపం అతని వదనమండలంపై ప్రతిబింబిస్తుంది. మనసులో కురుక్షేత్రం, హెలెన్‌అఫ్‌ట్రోయ్, నానావతి మెదుల్తున్నారు.

ముందున్న శేఖరం నిశ్చింతగా వీధిలోనికి మళ్లిపోయాడు.

ధనంజయుడు వీధిమొగలోనే దిగిపోయి చూపులతోనే శేఖరాన్ననుసరిస్తున్నాడు గత్యం తరంలేదు. ఒకవేళ ఇంకా ముందుకు తాను సాగితే రామం శ్యామంల ఇళ్ళమీదుగా పోవాలి. అంచేత ఆగిపోక తప్పలేదు.

నిర్భీతిగా సైకిలుదిగి స్వంతయిల్లులాగే తలుపుతట్టేడు శేఖరం. ధనంజయుడు కొయ్యబారిపోయాడు.

నవ్వుతూ సుభద్ర తలుపుతీయడం, ఇరువురూ లోనికి వెళ్లిన తరువాత తలుపు దగ్గరికి వేయడం స్పష్టంగా కనిపించింది.

గభాలున వేసిన అడుగు వెనక్కు లాక్కున్నాడు గాని, ఆ ప్రకృతి వర్ణనాతీతం. సైకిలు హేండిల్‌బార్ ప్లాస్టిక్‌క్లిప్స్ ముక్కలు ముక్కలుగా పిడికిలిమధ్యలో నలిగిపోయింది.

సుమారు అరగంటలో చిరునవ్వుతో సుభద్ర శేఖరాన్ని సాగనంపడం ఈచివర కిళ్లీ కొట్టుదగ్గరనుంచి గమనించి భారంగా సైకిలెక్కేడు.

ఆనాడంతా నిశితంగా గమనించాడు సుభద్రనుగాని, ఎక్కడా తొణకలేదు. తన మనసులోని ఆరాటాన్ని అణచుకున్నాడు. ఉద్రేకాన్ని తగ్గించుకున్నాడు.

నిలువదీసి అడుగుదామని అనుకున్నాడు గాని, 'రంకునేర్చినామె బొంకనేర్చు' నన్న సామెత వెనక్కు లాగుతుంది. కాకపోతే తనకు తానుగా ఎందుకు చెప్పదు ?

మనసులో అణగద్రొక్కిన హాలాహలం వేడిమికి శరీరం అంతా ఉడుకులెత్తి రెప్ప వేయ నవుసరంలేకుండానే తెల్లవారిపోయింది.

ఆనాడు మరి ఆఫీసుకు వెళ్లలేక సెలవు చీటి పంపించివేశాడు.

ఆ శలవు శలవు, వారం గడచిపోయింది. ఐతే ఆశ్చర్యం ఈవారంరోజులలోనూ శేఖరం మచ్చుకు కానరాలేదు.

ధనంజయు డూహించాడు. తను శలవు పెట్టినట్టు శేఖరానికి సుళువుగా తెలుస్తుంది ఆఫీసుగది ఒకటే గనుక

ఇక సుభద్రలోగూడ కొంత ఆరాటాన్ని ; దాన్ని అణచుకోడానికి చేస్తున్న వృథాప్రయత్నాలను గమనిస్తున్నాడు. కాగా ఈ వారం రోజులూ మల్లెపూలు లేవు.

ఎన్నాళ్లని ఇంట్లోకూర్చోగలడు? ధనంజయరావు యథాప్రకారం ఆఫీసుకు వెళ్తున్నాడు.

రెండురోజులు గడిచాయి.

మూడవరోజు మేడమీదనుండి దృష్టిసారినంతవరకూ శేఖరాన్ని గమనిస్తున్నాడు.

మెల్లిగా మేడదిగాడు. అజంతాహొటల్లో టీ త్రాగాడు. ప్రక్కనే కొట్టులో కొన్న సిగరెట్ ముట్టించాడు. మనసు వీలైనంతవరకు నిర్మలముచేసి దృఢత్వాన్నాపాదిస్తున్నాడు.

నెం. 13 బస్సు హాస్పిటలు దిగుడుదిగి కుడిప్రక్క మళ్ళి పయనించసాగింది.

సరిగా తనయింటివీధి మొగలో బస్సు దిగాడు ధనంజయుడు. ఎదురుగా తనయిల్లు ఇంటిముందు సైకిలు స్పష్టంగా కనుపిస్తుంది.

నెమ్మదిగా అడుగులువేసుకుంటూ సాగుతున్నాడు.

బయట వరండాయొక్క కిటికీవద్ద నిలుచున్నాడు. లోపలివాళ్లు తనకు కనిపిస్తున్నారు. వారి మాటలుగూడ వినిపిస్తాయి. వారితనిని చూడలేదు.

శేఖరం టేబిలునానుకొని నిల్చున్నాడు సుభద్ర అతనిగుండెపై మొగముపెట్టి అనుకునివున్నది. శేఖరం ఆమె వీపుమీద చేయి వేసి నిమురుతున్నాడు. సుభద్రతలలో మల్లెపూలు.

ఒక్కఊపున లోనికివెళ్లి ఇద్దర్నీ ముక్కలు ముక్కలు చేయాలనుకున్నాడు.

అతనికి కలా నిజమా తెలియడంలేదు. మనిషి నిలువెల్లా వణికిపోతున్నాడు. అతికష్టంమీద నిలద్రొక్కుకున్నాడు.

ఇంతా, ఇతననుకున్నట్లు వారులేరు. ఈ ప్రపంచంలోనే ఉన్నారు సుభ్రంగా. సుభద్ర వెక్కివెక్కి ఏడవడం స్పష్టంగా వినిపిస్తుంది.

ఈవిధంగా ఇంక కొద్దిరోజులేననీ, ఈ నాలుగు రోజులూపోతే వాళ్ళనాన్న, పెదనాన్న వస్తారనీ అనాడు తానే స్వయంగా కల్గించుకుని పరిస్థితిచక్కబరుస్తాననీ; అంతదాక మాత్రమిలాగే మధ్యాహ్నసమయంలో రోజు తప్పకుండా కనిపిస్తుంటాననీ ఓదార్చి చెవుతున్నాడు, 'ఈబాధ యిలాగ భరించడం ఎన్నాళ్ళన్నయ్యా' అని అడిగిన చెల్లెలుకు.

'అన్నయ్యా....నాకేప్రక్క చూసినా ఉన్నదల్లా అన్నయ్యవి నువ్వొక్కడివే, నీకు కూడా ఎటుచూసినా చెల్లెల్ని నే నొక్కదాన్నే, నా పెళ్ళికి నువ్వు రాకపోయినా, సెలవు దొరకలేదు అంటే, భరించాను గాని, ఒకే ఊరులో ఉన్నాం. ఆటు ఆయన, ఇటు నువ్వు ఇద్దరికీ బద్ధవైరం. మధ్యని నేను ఈ మనోవ్యాధినిలా ఎంతకాలం భరించాలన్నయ్యా?'

ధనంజయుడింక అజ్ఞాతంలో ఉండలేకపోయాడు. తన పెళ్ళికికూడా రానివ్వని కర్ణోటక అత్తవారింట్లోనున్న తన చెల్లెలు సావిత్రి జ్ఞాపకానికి వచ్చింది.

తనకున్న ఒక్కగా నొక్క అన్నయ్యపెళ్లికి రాలేకపోయాడు అని సుభద్ర చాలా రోజులు గోలపెట్టింది.

మెల్లిగా తలుపుతోసి లోని కడుగుపెట్టాడు

ఇద్దరికిద్దరూ స్థాణువుల్లాగు నిల్చుండిపోయారు.

ఉన్న ముగ్గురిలోనూ చలనం లేకపోవడం చేత నిశ్శబ్దం ఘనీభవించిపోయింది.

'ఇంత భయంకరపరిస్థితి చేతులారా ఎందుకు తెచ్చిపెట్టుకున్నావు సుభద్రా?' అంటూ సుభద్రతలపై చేయివేశాడు. సుభద్ర అయోమయంగా అతని నంటుకుపోయింది. సుభద్రను బుజ్జగిస్తూ 'నువ్వైనా చెప్పకోవురా వెధవా?' అంటూ శేఖరాన్ని అడిగేడు.

సుభద్ర టీ కాచింది ముగ్గురూ త్రాగారు. ఆనందం అంటే ఏమిటో నూటికి నూరు పాళ్లు అర్థమౌతుంది.

చచ్చిచెడి చాయంగల విన్నపములు.... శేఖరం సుభద్రకు చిన్నాన్నకొడుకు. సెలవు దొరక్క పెళ్ళికి రాలేకపోయాడు. ఈ ఊరు బదిలీచేయించుకుని వచ్చినతరువాత ఇంటి నెంబరుప్రకారం ఇల్లు కనుక్కొని చెల్లెలితో మాట్లాడేడు.

సుభద్ర తన పెళ్ళిఫోటో చూపించేసరికి గుండె ఆగినంతపనైంది. తనకు చిన్నప్పటి నుంచీ విరోధి. ప్రస్తుతం ఒకే ఆఫీసులో నున్నా ఎడముఖం పెడముఖం, ఆ ధనంజయుడే తనబావ. పరిస్థితి అంతా బోధపర్చి కొంతకాలం అజ్ఞాతంగానె వచ్చిపోతుంటానని నానా రకాలుగా బోధపర్చాడు. సుభద్ర గోల పెట్టేసింది.

చెప్పుడుమాటలు వినగూడదంటారు గాని, 'వినవగు నెవ్వరు చెప్పిన' అన్నారు మళ్ళీ....

ఐతే చిన్నవిశేషం 'వినినంతనె వేగపడక విపరింపదగున్' అన్నారు. అదే క్రియారంగం.

భగవత్సృష్టిలో జ్ఞానం మానవులందరికీ సమానంగానే యిచ్చాడు. దాని వినియోగాధికారం మానవునిచేతిలో ఉంచాడు.

ఆ జ్ఞానాన్ని సదవసరం నిమిత్తం సత్కాలంలో సద్వినియోగం చేయడమే మానవునిలో విశేషం. ధనంజయుడు తన అనుమానం నివృత్తిచేసుకోడానికి సరియైన పద్ధతి అవలంబించేడు. ఆ సమయం వచ్చేలోపల కలిగినటువంటి రకరకాలఘట్టాలకు ధైర్యంగా నిలువగలిగాడు—అలా కాకుండా ఏమాత్రం తొందరపడినా పరిస్థితులు విషమాతి విషమంగా పరిణమించి ఊరుకునేవి.

ధనంజయరావు శేఖరాలమధ్యవైరంపోయి శేఖరం చెల్లెలిగారింటికి మకాము మార్చాడు. శేఖరానికి హొటలు మెతుకులవస్థపోయింది. ధనంజయునికి శేఖరం సైకిలుమూలంగా ఆఫీసుకు రానూ పోనూ నడక తప్పింది.

★